రోజూ ఇంట్లో
జరిగే పనులకు
సినిమా ట్రయల్స్‌కు
ఉన్న సంబంధం?

శివల
జగన్నాధరావు
కథ

# ట్రయల్స్

"ఊళ్ళోరందరికీ తెల్లవారితే, నీకింకా తెల్లవారలేదుట్రా? అడ్డగాడిదా! లే! లే!"

ఆ మాటకోసం ఎదురుచూస్తున్న వాడిలా అప్పుడు పక్కమీద లేచి కూచుని ఆవలించేడు నాని.

నిజానికి నానికి గంట కిందటే మెలకువ వచ్చేసింది. ఎందుకురాదూ? తన సమీపంలో మోగుతున్నవి చిటపటలా? పటాసులా? అబ్బే! ఏకంగా లక్ష్మిబాంబులే గదా?!!

"ఏటే ? ఇప్పుడు తెల్లారిందే, నీకూ?'

తల్లి పని మనిషి మీద లేచింది!

"ఒకటా? రెండా? పాతిక రూపాయలు ఖచ్చితంగా నీ యధావపోస్తుంటే? అందులో ఒక్క రూపాయి కొట్టేస్తే, వంద ప్రాణాలు పోయినట్టూ విలవిల్లాడిపోతావ్?! పని మాత్రం ఎగనామం పెడ్తావు!!"

"ఏటమ్మా! ఒక్క రోజు రాకపోయేసరికి అల్లా శివాలెత్తిపోతన్నారేటి అలా?"

"చాల్లే! ఒక్క రోజా? వెలకి ఇరవయ్యి నాగాలు పెడతావు! నీ డబ్బు ఆకుల్లో పువ్వుల్లో పెట్టే నీకు సమర్పించేసుకోవడం!! ఎప్పుడూ మా పాచి గిన్నెలు మేవే తోముకొని చావడవూ!! ఇదిగో! ఇది చాలా అన్యాయం సుమా!! తిన్నది జీర్ణం కాదే!!"

పని మనిషి తెయ్యిమంటూ లేచిందా మాటకి, ఇంటావిడ మరో రెండింతలు లేచింది!!

చెవులు చిల్లులు పడిపోతాయనిపించింది నానికి. ఆ సీనూ, సౌండూ ఫేడవుట్ అయ్యీ, అంతలో, దేవుడి గదిలో తండ్రి



పూజ గట్టిగా వినబడసాగింది!! అష్టోత్తర నామావళి అదరగొట్టేస్తూంది!!

మరో ప్రక్కనించీ, చెల్లాయి కాబోలు! ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది!! దానికి ఆ వయసులోనే వార్తలంటే చచ్చేంత ఇష్టం. వెధవ శాడిస్టు బుద్ధి! ఎప్పుడు ఎవడు ఛస్తాడా? ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందా? ఏ రైలు పడ్తుందా? ఏ బస్సు

గుద్దుతుందా? ఏ రాజకీయ నాయకుడు ఆయింతా కుర్చీమీంచి పడ్తాడా? లేదా పైకిపోతాడా?... అని మహా ఇంట్రెస్టుగా ఆలకిస్తుంది రేడియోని.

"ఆకాశవాణి... వార్తలు మీరు వింటు న్నారు..."

నానికి ఎక్కడ మండాలో అక్కడ మండింది.

"నోర్ముయ్! వార్తలు వినకపోతే మరేవి టి? కుక్కకూతలా? నక్క అరుపులా మేం వింటున్నది? మధ్యలో ఓసారి గ్యాపకం చేయడం కూడానా? ఇంతోటి పాడుపీడ దుర్వార్తలకీనూ?" అని తిట్టుకున్నాడు దు ప్పట్లో.

"జగమే మారినదీ మధురముగా ఈ వేళా!..."

ఉలిక్కిపడి, తల బైటపెట్టి ఆవైపు చూశాడు.

విస్సన్నయ్య వాడీమధ్య కొన్న టూఇన్‌వ న్‌ని మోగిస్తూ మైమరచివున్నాడు!!

అది కొన్న నాటినుంచీ, వాళ్ళ స్నేహితు ల దగ్గర్నించీ రకరకాల కాసెట్లు తీసుకువచ్చీ మోగిస్తున్నాడు!! వేసినవాడు ఏ శెలవ్ రోజో, రాత్రో ఎప్పుడో వేసుకుంటే, బావున్నా? రోజూ, తెల్లవారే అది ఆన్‌చేస్తాడు ! అదో వేపునించీ మోత!!

"...మధురముగా ఈ వేళ!..."

నానికి మళ్ళా అక్కడే మండింది.

"ఇల్లంతా ఇలా యుద్ధాల్తో, మంత్రాల్లో హోరు ఎత్తి ఛస్తొంటే, మధురముగా ఈ వేళ మారిందిట!!

"విస్సూ! దాని పీకె నొక్కేస్తావా? లేదా?" అరిచేడు.

విస్సు నానిని ఒక సాదా దోపిడి చూసినట్టు అల్పంగా చూసేడు. పచ్చి తెలుగు సిన్మాని చూసినంత యూవగింపుగా, పరిహాసంగా తిలకించేడు.

"పోరా!" అన్నాడు.

"దాని పీకె నొక్కరా! ఏంచేస్తావు?" అన్నాడు.

"నా పీకె నొక్కుకుంటాను!"

విస్సు గట్టిగా నవ్వి, ఆ పాట అయిపోతే, మరోటి వేసేడు.

వీధిలో — పాల మనిషితో మరో యుద్ధం జరుపుతోంది తల్లి!!

"అసల్నీ ఉద్దేశం ఏవిటే? ఏవిటి? నీకు అడిగినంతా డబ్బు లిచ్చియాలీ? నీ వెధవ నీళ్ళ పాలు చౌంగనీళ్ళల్లా మేం పుచ్చుకో వాలా? ఏంఅన్యాయంగా వుందేమీకూ?... ఇదిగో! అది మంచిది కాదు సుమా!! మేం డబ్బుల్లో ఏం కలుపుతున్నావే??... ఇదిగో!. .."

"ఊర్కోమ్మా! మీ ముందే గదా గేదకి గడ్డెడతన్నావు? మరి మేవేదో దానికి మట్టిమ శానం పెట్టి అన్యాయం జేసినట్టు అరుస్తావేం దమ్మా?"

"అవునే! మా ముందే దానికి నాలుగు పరకలు వేస్తావ్!! తర్వాత దాని మొహం చూడవే! ఇదిగో! దానికే గనక నోరుంటేనా ? ఏకంగా ప్రధానికే నీ అన్యాయం వెళ్ళి చెప్పునే! అయినా... ఏ రాజ్యం వచ్చినా, పోలీసువాళ్ళకీ, మీ వ్యాపారస్థులికీ మీ జెండా ఒక్కలాగే ఎగుర్తోందే!!..."

"ధనమేరా అన్నిటికీ మూలం!... ఆ

ధనము...''

హరహరా! నాని ఎంత చెవులు మూసు కున్నా లాభం లేకపోతోంది!!

విస్సు ఒక్కటి చరిచి తమ్ముణ్ణి లేపేడు.

''నీకింకా తెల్లార్లేదా...?''

యుద్ధాలు — అష్టోత్తరాలు — వార్తలు — కాసెట్ల పాటలు — ఒక రసం కాదు!! నానారసాలూ! నవరసాలు!!

వాటన్నిటిమధ్య నుంచీ వెళ్లాడు పెర ట్లోకి నాని.

స్నానం చేసి, కాఫీ తాగుతూంటే, వీధిలో కూరలవాడి కేక వినిపించింది సైరన్‌లాగా!!

''అమ్మా కూరలే! కావాలా?'' అంది చెల్లాయి.

''కావాలా అని నన్నడుగుతున్నావా? ఏం? నీకక్కర్లేదా? నేనొక్కర్తినే మింగుతు న్నానా? వెధవ్వేషాలు! పిలువ్!''

''ఒరే! నానీ! వెళ్ళి ఆ గంప దింపరా! పెళ్ళివారిలా కూచుంటారు! అంతా!! ఒ క్కరూ కదల్రు! కంచం ముందు మాత్రం అవి లేవు ఇవి లేవనీ వెధవ మూల్గులు!! దింపరా!! ఆ విస్సుగాణ్ణి ఓ నిమిషం దాని నోరు నొక్కమను!!''

''అబ్బబ్బా! వెళ్తున్నానే!'' చెల్లాయి వెళ్ళిం ది.

నానికి ఆ కేకల గంద్రగోళంలో చేతిలో ని కాఫీ గ్లాసు జారిపడింది. రెండే గుక్కలు తాగేడంతే! మిగిలిన కాఫీ అంతా నేలపాలయి పోయింది.


''దీనుల కాపాడుటకు దేవుడే ఉన్నాడూ !... దేవుణ్ణి''

నాని రయ్య్‌మంటూ వెళ్ళి, టూ ఇన్ వన్ను పీకె నొక్కేసేడు.

''ఒరేయ్! ఎవ్రరా ఆపేసేరూ?''

అప్పుడే పెరట్లో కెళ్ళిన విస్సూ అరిచే డు.

''అమ్మ ఆపేమందిరా!'' తల్లి మీదికి నెట్టేసేడు నాని.



“అమ్మ ఆపేమందా? ఓహో! సరే! అన్న వెయ్యమంటున్నాడు! వెయ్యి” విస్సు దబదబా వచ్చేసి, కేకలు వేసేడు. వాడి బాధ పడలేక, టూ ఇన్ వన్నుని మళ్లీ గొంతు నిమిరేడు నాని.

అటు కూరలవాడితో యుద్ధం! పేపరు వాడు పేపరు ఒక్క విసురు విసిరేసి పోయేడు. దుర్వార్తలకోసం సిస్టరు దాని మీద పడింది వెళ్ళీ!

పని మనిషితో, పాల మనిషితో, కూరల వాడితో యుద్ధాలికి హడలెత్తిపోవాలా? వార్తలకి మూర్ఛపోవాలా? నాన్న మంత్రాలకి ప్రసన్నుడవాలా? అటు విస్సుగాడి పాటలకి పరవశించిపోవాలా??

అదంతా ఉదయం — రోజూ — పది గంటల దాకా జరిగే నవ రసాల సమ్మేళన కార్యక్రమం!!

నాని డిగ్రీ ముగించీ ఉద్యోగం వేటలో ఉన్నాడు. పగలంతా ఆ వేట!! అప్లికేషన్లు!! ఇంటర్వ్యూలు! అపజయాలు! మళ్ళా చిన్న ఆశాకిరణం!!

సాయంత్రం ఏదయినా సినిమాకి పోదామని బయలుదేరేడు నాని, ట్రిమ్ముగా ముస్తాబయి, జేబులో ఈ మధ్య ట్యూషన్ల ద్వారా సంపాయించుతున్న తన స్వార్జితాన్ని పెట్టుకుని, ఏ.సి.హాలు కెళ్లాడు.

ఆ సినిమా కాస్త బాగుందని వార్తలు విన్నాడు. క్యూలో యుద్ధ మాడీ, గెల్చి, టిక్కెట్టు సంపాదించీ, హాల్లోకెళ్ళేసరికి చీకటిగా ఉంది అక్కడ!

అప్పుడే తెరమీద తమ థియేటర్ ఆధిక్యతని చూపించుకొంటున్నారు!!

పడ్తూ, లేస్తూ తడుముకుంటూ వెళ్ళి తన నెంబర్లో కూచున్నాడు.

‘సరి! ఇహ మొదలు’ అనుకున్నాడు నాని కొంచెం విసుగ్గా.

వీళ్ళంతా మూడు ముస్తాబులూ అయి, ట్రిమ్ముగా వస్తారా సినిమాకి, రాగానే, వాళ్ళ మొహాలముందే. అదిగో! ఒకడు తెరంతా అంత నోరు విప్పి, పెద్ద బ్రష్‌తో పరపరా పళ్ళు తోమేస్తున్నాడండీ!!! అసయ్యంగా!

దంతధావనం అయిందా? ఇంక—

ఆవిడ తను మెచ్చే సబ్బుతో తోవుతోంది! ఒళ్ళు అంతా!! ఎంత ఫ్రీగా, స్వేచ్ఛగా తోవుతోందో?? ఆ విధంగా, మరి ఇద్దరు కూడా, మర్రెండు రకాల సబ్బుల్తో, వీళ్లందరి మొహాలముందే, హాయిగా నీళ్ళోస్కున్నారు!!

ఆ తరువాత — మూలుగులు!! ఒకరికి కాలు బెణికింది! ఒకరికేమో పుప్పి పన్నూడి పోయింది!! మరొకరికి? జలుబు!! అందరి మొహాల మీదా ఆ తెరంత సాచీ తుమ్మేడు!!

వాళ్ళ అనుష్ఠానాలనీ, వాళ్ళ మూల్గుల్నీ, బాధల్నీ, వాళ్ళ నానారకాల యాతనల్నీ వాళ్ళ మొహాల మీద మొటిమల్నీ, అన్నింటినీ, ప్రేక్షకులు, కుతూహలంతోనో లేక అంత డబ్బిచ్చుకుని అప్పుడే లోపలికి వచ్చినందుకు, వెంటనే అవతలకి వెళ్ళలేకో మొత్తానికి తిలకించిన అనంతరం —

ట్రయల్స్!!

అదేదో హిందీ సినిమా ట్రయల్సట!!

తెయ్యిమంటూ ఒకామె జీన్సులో ఆడీ పాడేసింది. అంతలో పెద్ద ఫైటింగు!

ఘోరంగా!! ఇంతలో — క్లబ్ డాన్స్!! అంతలో — హీరో హీరోయిన్ల డ్యూయెట్టు!!

గభాల్న— విలన్తో ఫైటింగు! ఒక పెద్దావిడ దేవుడి పటాలముందు పాటతో ఏడుపు!

లేదా ఏడుపుతో పాట!! ఎందుకొచ్చిందో అపార్థం?! హీరోయిను హీరోని దుమ్మెత్తిపో సేస్తోంది అంతలోనే!!

అంతా కలగాపులగం!! ఆ పేరు గాని పెడితే ఎంత బావుండుని సినిమాకి?! అని అనుకున్నాడు వాని.

ఒక సీనుకి మరో సీనుకి సంబంధం ఉండదు!

అలోపాలోమనీ రకరకాల సీన్లన్నింటినీ చూపించితే, 'ఓహో! ఏధో వుందే సినిమా లో?' అనుకుని జనం వెళ్తారని!

వానికి తమ ఇంటిలో ఉదయం అయిదు న్నర గంటలనుంచీ, పదిన్నర వరకూ జరిగే తతంగం! ఆ గంద్రగోళం జ్ఞాపకం వచ్చింది

అవీ ఈ ట్రయల్స్‌కి పోలిక వుంది!!

ఓవైపున పాటలు — మరో వైపునుంచీ యుద్ధాలు — వార్తలు — పూజలు — ఇన్నీ అన్నీ హడావుళ్ళు కావు!!

తమ ఇంట్లోనేనా? లేక చాలా ఇళ్ళల్లో ఇలాంటి "ట్రయల్స్" అవుతుంటాయా?

నవ్వుకుంటూ అనుకున్నాడు వాని.



## డేంజర్



తన సూట్ కేస్ కంపార్ట్‌మెంట్‌లో పోయిందని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడో వ్యక్తి.

"అందులో ఏమేం వున్నాయ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఐదు నాటుబాంబులు, రెండు రివాల్వర్‌లు" సింపుల్‌గా చెప్పాడా వ్యక్తి.

ఆశ్చర్యపోతూ ఇన్‌స్పెక్టర్ "అవి వుంటే నేరమని తెలీదా?" గద్దించాడు.

"తెల్సుసార్! అందుకే కదా కనబడకుండా సూట్ కేస్‌లో పెట్టుకుని తీసుకెళ్తున్నాను" అన్నాడా వ్యక్తి తాపీగా.

—రమణి శ్రీనివాస్ (వినుకొండ)